ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తావిభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ 28-08-2024 సమయం 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. హైదారాబాద్ లోని రాష్ట్ర సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ ఉదయం భూమి పూజ చేశారు.

2. చెరువుల ఆక్రమణలపై ప్రభుత్వం వెంటనే శ్వేత పత్రం విడుదల చేయాలని CPI రాష్ట్ర కార్యదర్శి, శాసనసభ్యులు కూనం నేని సాంభశివరావు డిమాండ్ చేశారు

3. మార్క్ ఫెడ్ ద్వారా పెసర కొనుగోలు కేంద్రాలు తక్షణమే ఏర్పాటు చేసి రైతులు నష్టపోకుండా చూడాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు ముఖ్యమంత్రికి లేఖ రాశారు.

4. వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయ విస్తరణకు త్వరలోనే పనులను ప్రారంభించి, తిరుమల మాదిరిగా శాశ్వత అన్నదానం ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.

**CM భూమి పూజ:**

హైదారాబాద్ లోని రాష్ట్ర సచివాలయం ప్రధాన ద్వారం సమీపంలో తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటుకు ముఖ్యమంత్రి A రేవంత్ రెడ్డి ఈ ఉదయం భూమి పూజ

చేశారు. మంత్రులు, ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ సలాహాదారులు సమక్షంలో సంప్రదాయ పద్ధతిలో శంకుస్థాపన జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ... గత పాలకులు తెలంగాణ తల్లిని తెరమరుగు చేశారని ఆరోపించారు. సచివాలయాన్ని తమ ప్రభుత్వం ప్రజలకు అందుబాటులోకి తెచ్చిందని అన్నారు. గత ప్రభుత్వం 21 లక్షల కోట్ల రూపాయిలు ఖర్చు చేసినా ఒక్క కోటి రూపాయలు తెలంగాణ తల్లి విగ్రహం కోసం ఖర్చు చేయలేదని ఆరోపించారు. రాష్ట్ర ఏర్పాటులో కీలక పాత్ర పోషించిన ఎందరో విగ్రహాలు సచివాలయం సమీపంలో ఉన్నా , దేశం కోసం ప్రాణాలర్పించిన మాజీ ప్రదాన మంత్రి రాజీవ్ గాంధీ విగ్రహం లేకపోవటం లోటుగా భావించి, మేధావుల సూచనలతో ఆయన విగ్రహ ఏర్పాటును చేపట్టినట్లు ముఖ్యమంత్రి చెప్పారు. తెలంగాణ తల్లి విగ్రహాన్ని తెలంగాణ పౌరుషానికీ, పోరాట పటిమకు ప్రతీకగా రూపొందిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియకు తొలి ప్రకటన వెలువడిన డిసెంబర్ 9 నాడే తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

(MSL)

**CPI-హైడ్రా:**

చెరువుల ఆక్రమణలపై ప్రభుత్వం వెంటనే శ్వేత పత్రం విడుదల చేయాలని CPI రాష్ట్ర కార్యదర్శి, శాసనసభ్యులు కూనం నేని సాంభశివరావు డిమాండ్ చేశారు. చెరువు శికం భూముల్లో నిర్మాణాలు చేపట్టేందుకు అనుమతులిచ్చిన అధికారులు, అప్పటి మంత్రులపై చర్యలు తీసుకోవాలని కూడా డిమాండ్ చేశారు.

హైదరాబాద్ లో విలేకరులతో మాట్లాడుతూ.. చెరువుల పునరుద్ధరణ జరగాలన్నారు. హైదారాబాద్ జంట నగరాల పరిధిలో ఎన్ని చెరువులు ఆక్రమణాలకు గురయ్యాయో జాబితాను హైడ్రా విడుదల చేయాలని సూచించారు. హైడ్రా తో ఆక్రమణదారులు భయపడాలన్న సాంబశివరావు, హైడ్రా పేరుతో పేదల ఇళ్ళను కూల్చవద్దని కోరారు. ఋణమాఫీ విషయంలో ప్రభుత్వం వాస్తవాలు చెప్పాలని, రేషన్ కార్డు నిభంధన లేకుండా, ఎన్నికల్లో హామీ ఇచ్చినట్టు అర్హులు అందరికీ పంట రుణమాఫీ చేయాలని సూచించారు.

(MSL)

కొనుగోలు కేంద్రాలు:

రాష్ట్రంలో వివిధ జిల్లాల్లో మార్క్ ఫెడ్ ద్వారా పెసర కొనుగోలు కేంద్రాలను వెంటనే ఏర్పాటు చేసి రైతులు నష్టపోకుండా చూడాలని BRS పార్టీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. పార్టీ సీనియర్ నాయకులు హరీష్ రావు ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. పప్పుధాన్యాల సాగును ప్రోత్సహిస్తూ కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది క్వింటాలు పెసరకు 8 వేల 682 రూపాయిల మద్దతు ధరను ప్రకటించిందని, అయినా రైతులు ఈధరకు తమ పంటను అమ్ముకోలేకపోతున్నారని ఆయన వివరించారు. కొనుగోలు కేంద్రాలు తగినన్ని లేకపోవటంతో వ్యవసాయ మార్కెట్లు, గ్రామీణ ప్రాంతాల వ్యాపారులకు పంటను క్వింటాలు 6 వేల రూపాయిలకే అమ్మి రైతులు నష్టపోతున్నారని పేర్కొన్నారు. ఖమ్మం, మహబూబాబాద్, వికారాబాద్, కామారెడ్డి, సంగారెడ్డి,

నారాయణ పేట, సూర్యపేట లాంటి జిల్లాల్లో వెంటనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులు నష్టపోకుండా చూడాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు.

(MSL)

**హన్మకొండ-గవర్నర్ పర్యటన**

రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ రెండో రోజు హనుమకొండ జిల్లాలో పర్యటిస్తున్నారు. ఈ ఉదయం ములుగు-లక్నవరం నుంచి రోడ్డు మార్గాన హనుమకొండ ఎన్ ఐ టికి చేరుకున్న గవర్నర్ కు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావిణ్య నగర మేయర్ గుండు సుధారాణి ఘనస్వాగతం పలికారు. హనుమకొండ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అధికారులతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రావీణ్య హనుమకొండ జిల్లాలోని చారిత్రక దేవాలయాలు, ప్రదేశాలు, పార్కులు, జాతీయ రహదారులు, స్మార్ట్ సిటీ, ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు, విపత్తుల నిర్వహణ సమయంలో, ఇతరత్రా అంశాలకు కోసం వినియోగిస్తున్న ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ తదితర అంశాలను గురించి గవర్నర్ కు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

(పీటీసీ, హన్మకొండ)

**కవిత-హైదరాబాద్**

ఢిల్లీ మద్యం విధానం కేసులో ఐదు నెలలుగా జైలులో ఉండి నిన్న రాత్రి బెయిల్‌పై విడుదలైన కవిత ఈరోజు సాయంత్రం హైదరాబాద్ చేరుకుంటారు. సాయంత్రం

శంషాబాద్ విమానాశ్రయంలో దిగి అక్కడి నుంచి నేరుగా తన నివాసానికి వెళ్తారని ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. కవితకు స్వాగతం పలికేందుకు బీఆర్ఎస్, భారత జాగృతి ఏర్పాట్లు చేసింది. కాగా, నిన్న రాత్రి ఢిల్లీలోని తిహాడ్ జైలు నుంచి విడుదలైన సమయంలో కవిత మాట్లాడుతూ... తనకు పోరాటం కొత్త కాదని 18 సంవత్సరాల రాజకీయ జీవితంలో ఎన్నో ఎత్తుపల్లాలు చూసానని అన్నారు. (డెస్క్)

**కవిత బెయిల్-జగదీశ్ రెడ్డి**

టీఆర్ఎస్ నాయకురాలు కవితకు బెయిల్ విషయంపై కాంగ్రెస్, బీజేపీ నాయకులు పొంతన లేని మాటలు మాట్లాడుతున్నారని మాజీ మంత్రి జగదీష్ రెడ్డి అన్నారు. బీజెపి, కాంగ్రెస్ నాయకులు కోర్టు తీర్పును కూడా గౌరవించే పరిస్థితిలో లేరని అన్నారు. ఎలాంటి ఆధారాలు లేకుండానే కేవలం నాయకుల ఆరోపణలను పరిగణనలోకి తీసుకుని కవితపై మద్యం విధానం కేసు నమోదైందని అన్నారు. (Suryapet/PTC)

**వనపర్తి జాతీయ మైనారిటీ కమిషన్ సభ్యురాలు**

కేంద్ర ప్రభుత్వం అల్పసంఖ్యాకుల అభ్యున్నతి కావల్సిన అన్ని చర్యలు తీసుకుంటుందని జాతీయ మైనారిటీ కమిషన్ సభ్యురాలు సైయద్ షహజాది అన్నారు. ఈ ఉదయం వనపర్తి జిల్లా కేంద్రంలోని తెలంగాణ మైనారిటీ బాలికల గురుకుల పాఠశాలను సందర్శించారు. విద్యార్థులతో కలిసి అల్పాహారం చేసి.. పాఠశాలలో అందిస్తున్న భోజనం, విద్యా వసతులను విద్యార్థులను అడిగి

తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... నాణ్యతతో కూడిన భోజనం, విద్య, సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. (పిటిసి, వనపర్తి జిల్లా)

**వేములవాడ-పొన్నం ప్రభాకర్**

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయ విస్తరణకు వేద పండితులు, శృంగేరి పీఠాధిపతుల అనుమతితో త్వరలోనే పనులను ప్రారంభిస్తామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ఈ ఉదయం రాజ రాజేశ్వర స్వామిని దర్శించుకున్న మంత్రి మాట్లాడుతూ... రాష్ట్రంలో అత్యధికంగా భక్తులు వచ్చేది వేములవాడ ఆలయానికేనని అన్నారు. రాబోయే కార్తీకమాసంలో, తిరుమలలో మాదిరిగా వేములవాడలో శాశ్వత అన్నదానం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అలాగే ఆలయంలో ప్రధాన మొక్కు కోడెల సంరక్షణ కోసం ముఖ్యమంత్రి ఆదేశాలతో గోశాలను ఆధునీకరణ చేస్తున్నామని తెలిపారు.

(పిటిసి, రాజన్న సిరిసిల్ల జిల్లా)

**ములుగు-సంపూర్ణత షెడ్యూల్ బైట్**

సంపూర్ణత అభియాన్ లో భాగంగా ములుగు జిల్లాలోని కన్నాయిగూడెం బ్లాక్ లో 18 పాఠశాలల్లో వంద శాతం విద్యుదీకరణను పూర్తి చేశామని కన్నాయిగూడెం మండల విద్యాధికారి రాజేష్ ఆకాశవాణితో తెలిపారు.

(బైట్ ... మండల విద్యాధికారి రాజేష్)

(PTC, Hanumakonda)

**సూర్యపేట-కలెక్టర్**

సూర్యాపేట జిల్లా కోదాడలోని బీసీ బాలుర కళాశాల వసతి గృహాన్ని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ నిన్న అర్థరాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడి విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గతంలో గ్రీవిన్స్ పిర్యాదులో వచ్చిన పిర్యాదుకు స్పందించి వసతి గృహాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించి, మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు . (పీటీసీ, సూర్యాపేట)

**భద్రాద్రి-కలెక్టర్**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్య శిబిరాలు నిర్వహించాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్య అధికారులను జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆదేశించారు. జిల్లాలోని ప్రాథమిక, మాతాశిశు ఆరోగ్య కేంద్రాల్లో సీజేరియన్ ఆపరేషన్లు తగ్గించి.. సాధారణ కాన్పుల శాతాన్ని పెంచాలని సూచించారు. అలాగే బరువు తక్కువున్న పిల్లల్ని గుర్తించి.. వారికి పౌష్టికాహారం అందించాలని తెలిపారు. (భద్రాద్రి కొత్తగూడెం జిల్లా)

**ఆసిఫాబాద్-తీజ్ ఉత్సవాలు**

ఆసిఫాబాద్ జిల్లాలోని గిరిజన తండాలలో శ్రావణ మాసంలో నిర్వహించే తీజ్ ఉత్సవాలు కొనసాగుతున్నాయి. జిల్లాలోని గోలేటి, లింగాపూర్, సిరిపూర్(యు) తో పాటు పలు మండలాల్లో ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. మహిళలు పెద్ద ఎత్తున పాల్గొనే లంబాడ ఉత్సవాలు కావడంతో ఆయా తండాలకు చెందిన వారు కూడా ఏర్పాట్లు చేస్తారు.

(ఆసిఫాబాద్ జిల్లా పిటిసి)

**గణేష్ మండపాలు-వినాయకచవితి**

వినాయక చవితి పండుగను పురస్కరించుకొని, ఆసిఫాబాద్ జిల్లా జిల్లాలో గణేష్ విగ్రహాలను ప్రతిష్టించడం, మండపాలు ఏర్పాటు చేసేవారు ముందుగా పోలీసుల అనుమతి తీసుకోవడం తప్పనిసరి అని జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు తెలిపారు. (ఆసిఫాబాద్ జిల్లా పిటిసి)

**సిరిసిల్ల-మిడ్ మానేరు**

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని మిడ్ మానేరు ప్రాజెక్టుకు ఇన్ ఫ్లో కొనసాగుతుందని ప్రాజెక్ట్ అధికారులు తెలిపారు. జలా శయం పూర్తి సామర్థ్యం 27.5 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 18.19 టీఎంసీల నీరు నిల్వ ఉందని వెల్లడించారు.

(పిటిసి, రాజన్న సిరిసిల్ల)

**సిరిసిల్ల-ఉత్తమ ఉపాధ్యాయుడు**

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం దమ్మన్నపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు తాడూరి సంపత్ కుమార్ జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారానికి ఎంపికయ్యారు. సంపత్ కుమార్ అనేకవిజ్ఞాన ప్రదర్శనలకు గైడ్ టీచర్ గా వ్యవహరించి విద్యార్థులు అంతర్జాతీయ, జాతీయ రాష్ట్రస్థాయి అవార్డులు అందుకోవడంలో కృషి చేశారు. తన ఉపాధ్యాయ వృత్తి ముగిసేలాగా 100 మంది గ్రామీణ విద్యార్థులను ఇన్నోవేటర్లుగా చేయాలన్న లక్ష్యంగా పెట్టుకొని ఇప్పటివరకు 58 మందిని ఇన్నోవేటర్లుగా మార్చారు. (పిటిసి, రాజన్న సిరిసిల్ల)

**సంగారెడ్డి-డీఈవో**

సంగారెడ్డి జిల్లాలో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం బిల్లులు 1 కోటి 11 లక్షల రూపాయలు నిధులు విడుదలైనట్లు డీఈఓ వెంకటేశ్వర్లు తెలిపారు. సంగారెడ్డి జిల్లాలో 12 వందల 24 పాఠశాలలో 1 లక్షా 7 వేల 204 మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందుతుందని తెలిపారు. (SANGAREDDY, PTC)

**సిరిసిల్ల-ఆత్మహత్య**

రాజన్న సిరిసిల్ల జిల్లా సిరిసిల్ల పట్టణానికి చెందిన 30 ఏళ్ల జక్కని సతీశ్ అనే చేనేత కార్మికుడు నిన్న సాయంత్రం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పట్టణంలోని బీపై నగర్ కు చెందిన సతీష్ వైపని కార్మికుడిగా పనిచేస్తున్నాడు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సంక్షోభంతో ఎనిమిది నెలలుగా పని లేకపోవడంతో ఓవైపు

కుటుంబ పోషణ, మరో వైపు ఆర్ధిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబీకులు తెలి పారు. మ్రుతుడి అక్క సువర్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సిఐ కృష్ణ తెలిపారు. (పిటిసి, రాజన్న సిరిసిల్ల జిల్లా)

**మిర్యాలగూడ-పాడి రైతులు**

నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలం శ్రీనివాస్ నగర్ లోని సంగం డైరీ వద్ద పాడి రైతులు ఆందోళన చేపట్టారు.. సంగం డెయిరీ ప్రారంభోత్సవాన్ని చుట్టుపక్కల గ్రామాల పాడి రైతులు అడ్డుకున్నారు. గతంలో అక్కడ నడిపిన VT డెయిరీగా ఉన్న సంస్థ ను బకాయిలు పడ్డ నేపథ్యంలో బ్యాంక్ అధికారుల వేలంలో సంఘం డెయిరీ కొనుగోలు చేసింది. ఈ రోజు నూతన యాజమాన్యం డైరీని ప్రారంభించేందుకు సన్నద్ధం కాగా తమకు VT డైయిరి లక్షల రూపాయల పాత బకాయిలు చెల్లించాలని, వాటిని చెల్లించిన తర్వాతే సంగం డైయిరిని ప్రారంభించుకోవాలని పాడి రైతుల ఆందోళన చేపట్టారు.

(పిటిసి, నల్లగొండ జిల్లా)

**నిర్మల్ చోరీ**

నిర్మల్ జిల్లా కేంద్రంలో సోఫీ నగర్ కాలనీలో సాయి వైష్ణవి బార్ అండ్ రెస్టారెంట్ దొంగతనం చోటు చేసుకుంది. బార్ షట్టర్ పగలగొట్టి లోనికి ప్రవేశించిన దొంగలు సీసీ కెమెరాలు ధ్వంసం చేసి కౌంటర్ లోని దాదాపు 30 వేల నగదు, 3 వేల

రూపాయల మద్యంను అపహరించినట్లు బార్ సభ్యులు తెలిపారు. పోలీసులకు సమాచారం అందించడంతో అక్కడికి చేరుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

(పీటీసీ, నిర్మల్)